

రావాలంటే ఎంతో శ్రమ వ్యర్థమయిపోతుంది. అందుకనే మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను." భానోజీ అందమైన పెదవులమీద చిరునవ్వు మెరిసింది.

ఆమె కొంచెంసేపు తటపటాయించి చివరకు, "సరే, పదండి" అని యంత్రంలా ముందుకు నడిచింది. కారు ఒక పెద్ద షాపు ముందు ఆగింది. ఇద్దరూ లోపలికి నడిచారు. షాపు అతను వాళ్ళముందు అందమైన మెత్తని సిల్కుచీరలు పరిచాడు.

"మీకు నచ్చిన చీరెలు నాలుగు తియ్యండి" అన్నాడు భానోజీ.

# రాత్రి ఒక వింత
# శాంత ఒక రోజు

"మనిషి శరీరచ్ఛాయను బట్టిగదా ఏరెం సెలక్టు చేసేది? మీరు ఎవరికి కొంటున్నారో ఏం? ఊర్మిల గారికేనా?"

"అచ్చు మీలాంటి రంగుగల ఆవిడికి. త్వరగా తెమ లండి మరి!" ఆమె వేరే ఆలోచించడానికి వ్యవధి ఇవ్వ కుండా అతను ఆమెను తొందరచేశాడు. ఆమె ఏరిఏరి నాలుగు చీరెలు ఒయటికి తీసింది. బిల్లు చెల్లించి ఇద్దరూ షాపు బయటికి వచ్చారు.

"నేను వచ్చిన పని అయింది గదా. ఇక వెళతాను" అని అడిగింది మృణాళిని.

"నాకోసం ఇంత కష్టపడ్డ మిమ్మల్ని ఊరికే వెళ్ళ నిస్తానా? కొంచెం కాఫీ తాగి వద్దాం, రండి."

"వద్దండి. నాకు చాలా ఆలస్యమైపోతుంది. మా నాన్న ఎదురు చూస్తూ ఉంటారు."

"నేను కారులో దిగబెడతాగా, పదండి."

'ఇది ఎక్కడి తద్దినంరా బాబూ' అని లోపల తిట్టు కుని పైకి తిట్టే సాహసం లేక, ఆమె కారులో కూర్చుంది. ఇద్దరూ హోటలుకు వెళ్ళి ఫామిలీ రూములో కూర్చు న్నారు. భానోజీ టిఫిన్, కాఫీలకి ఆర్డరిచ్చాడు. మృణాళి నికి ముండ్లమీద కూర్చున్నట్లుంది. అతను హుషా రైన కబుర్లు చెబుతున్నాడు. ఆమె వింటూన్నట్లు కనిపిస్తూంది గానీ ఆమె మనస్సుమాత్రం హేమలత చెప్పిన మాటలు నెమరు వేస్తూంది.

అతను అన్న చివరిమాటలు ఆమెను మేల్కొలిపాయి.

"ఆ చీరెలు నీకు చాలా అందంగా ఉంటాయి, మృణా! అందుకనే కొన్నాను." అతని మాటల్లో మార్దవం తొణికిసలాడింది. ఆమెకు అర్థంగాక అతని ముఖంలోకి పరిశీలనగా చూసింది.

"నిజంగానే. నువ్వు అవి కట్టుకొని అందంగా మెరిసి పోతూంటే చూడాలని ఉంది." అతని ముఖం ఉద్రేకం వల్ల అరుణిమ దాల్చింది.

మృణాళిని తనను తాను నిగ్రహించుకొని, "మీరు అంటున్నదానికి అర్థమేమిటి?" అని ప్రశ్నించింది.

"ఏమీ తెలియనట్లు నటించకు. మీ ఆడవాళ్ళలో ఉన్న బెట్టే అది. ఏమీ తెలియనట్లు అమాయకంగా నటించి వ్యవహారమంతా నడిపిస్తారు." అతని మాటల్లో లవలేశం తృణీకారం కనిపించింది.

"నటించడమా? నేను మీతో నటన సాగి స్తున్నానా?"

"కాకపోతే ఏమిటి? ప్రతిసారి నేను ఎక్కడికి రమ్మన్నా ముందర బెట్టు చెయ్యడం, తరవాత ఒప్పుకోవడం, నాచేత బ్రతిమాలించుకోవాలనుకోవడం, ఇవన్నీ ఏమిటి?"

"స్త్రీలను గురించి అంత నీచంగా ఆలోచించకండి. చనువుగా ఉన్నంత మాత్రాన తేలిక మనుష్యులుగా భావించవద్దు. మన దేశం ఎంత అభ్యుదయంలోకి వస్తూన్నా, స్త్రీలకు సంబంధించిన ఈ విషయంలో మటుకు చాలా వెనకబడే ఉంది. మీ బలవంతంవల్ల, మిమ్మల్ని ఎదిరిస్తే ఉద్యోగానికి కలిగే నష్టానికి భయ పడి మీతో తిరుగుతున్నాను కాని మీపై మోజుచేత కాదు. మీవంక ఒకసారి చూసి, మీతో నవ్వుతూ మాట్లాడినంత మాత్రాన ప్రతిస్త్రీ మిమ్మల్ని మోహించి, మీవెంటబడితిరుగుతుందనుకోకండి. మనిషి చదువు చదివినంత మాత్రాన కాదు. విశాల దృక్పథం అలవరచుకోవాలి. హేమలత మిమ్మల్ని గురించి అంతా చెప్పింది. మీ భార్యను చులకనగా చూసి, పరాయిస్త్రీల వెంటబడడం ఏమి సబబు? ఆమె ఎంత బాధ పడు తున్నారో ఒక్కసారైనా ఆలోచించారా? ఆమెకూడా మీకు మల్లేనే ప్రవర్తిస్తే మీకు ఎంత బాధగా ఉం టుంది! ఆమె మటుకు మీలాంటి మనిషి కారూ? ఇప్పటికే అధికంగా మాట్లాడినట్లున్నాను. క్షమించండి. నేను వెళ్తున్నాను." ఆమె జవాబయినా ఎదురు చూడ కుండా వెళ్ళిపోయింది.

భానోజీ కళ్ళు క్రోధంతో కెంపు లయ్యాయి.

మరునాడు ఆఫీసులో ప్యూను ఇన్ని ఫైల్సు తెచ్చి మృణాళిని టేబుల్‌మీద పెట్టి, "ఇవాల్టికి అయిపోవా లన్నారు" అన్నాడు. అవన్నీ ఎప్పటివో పాత ఫైల్సు. మృణాళిని సాయంత్రం దాకా టైపు చేస్తూనే ఉంది. చేస్తూన్న కొద్దీ కొత్తవి వస్తూనే ఉన్నాయి. చేతులన్నీ నొప్పిపెట్టి ఆమెకు ఏడుపు పర్యంతం అయింది. ఇంతలో ఆఫీసరు దగ్గరనుంచి పిలుపు వచ్చింది.

"పని పూర్తి అయిందా?" నిర్లక్ష్యంగా ఉంది అతని కంఠం.

"లేదండి. రేపటికి తప్పక పూర్తి చేస్తాను." ఆమె నీరసంగా సమాధానం ఇచ్చింది.

"ఇవాళ ఆ పని పూర్తిచేసి ఇంటికి వెళ్ళండి. రేపటికి వాయిదా వెయ్యడం నాకు ఇష్టం లేదు. పని అన్న తరవాత త్వరగా చెయ్యాలి కాని రోజులకి రోజులు తీసు కుంటే ఎలా?"

"రేపటికి తప్పకపూర్తి అయిపోతుందండి. పొద్దుటి నుంచి ఒక్క నిమిషం కూడా రెస్టు తీసుకోకుండా చేస్తూనే ఉన్నాను."

"అలా వీల్లేదు. ఇవాళటికి పూర్తి చెయ్యండి." అతని కంఠం భీకరంగా గర్జించింది.

ఆమె అతనివంక నిదానంగా చూసింది. కాటు వెయ్య బోయే పాము ఆమె మనఃపథంలో గోచరించింది.

"క్షమించండి. తక్కిన గుమాస్తాలందరూ వెళ్ళి పోయారు. నేను ఒక్కర్తిని ఒంటరిగా ఉండి ఆ పని చెయ్యలేను. రేపటికి తప్పకపూర్తయిపోతుంది." మృణా ళిని ఓపికతో సమాధానమిచ్చింది.

"బాగా ఆలోచించుకునే మాట్లాడుతున్నారా?" బెదిరింపుగా అన్నాడు భానోజీ.



"అన్నీ ఆలోచించుకునే మాట్లాడుతున్నాను." ఆమె శాంతంగా సమాధానమిచ్చి గది బయటికి వచ్చేసింది.

మరునాడు మృణాళిని ఆఫీసుకి వచ్చేటప్పటికి ప్యూను ఆమెచేతికి ఒక కాగితం ఇచ్చాడు. ఆమె పని సంతృప్తి కరంగా లేనందువల్ల పనిలోనించి తీసివెయ్యడమైనదని ఉంది అందులో. ఆమె భారంగా నిట్టూర్చి తన సీటు వంక చూసింది. అక్కడ కొత్త అమ్మాయి కూర్చొని ఉంది. 'కొత్తపిట్ట వలలో చిక్కింది అన్నమాట!' అని మృణాళిని తల పంకించింది. ఆ పిల్ల భవిష్యత్తుకు జాలి పడుతూ తన భవిష్యత్తు వెతుక్కుంటూ బయలు దేరింది మృణాళిని. ★